# నాగరికుడు

## చలసాని ప్రసాదరావు

ఇవ్వాళ ఒకటో తారీఖు...!

కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న దిన మిది!

ప్రస్తుతం జేబు నిండుగా ఉంది!

మనసుకూడా నిండుగా ఉంది! సంధ్యాసమయపు చల్లగాలి శరీరానికి గిలిగింతలు పెడుతూంది! అసలే చలి కాలమేమో, అందుకుతోడు నేను తొడుక్కున్న షార్క్ స్కిన్ సూట్ కలిసి క్రమంగా వణుకుకూడా ప్రారంభం కాసాగింది? రోజూ యీ టైముకి యింటి వద్ద వుండాల్సిందసలు! కాని యీ రోజు అన్నిరోజుల లాంటిది కాదు...! ఇవ్వాళ ఒకటో తారీఖాయె! ఈ ఒక్కరోజైనా కాస్త అటూ యిటూ తిరిగి ఎంతో కొంత ఖర్చుచేస్తేగాని యింటికి పోబుద్ధి వేయదు! అయినా బ్రహ్మచారులు పెందరాళే యింటికి పోవాలని ప్రయత్నించడం అర్థంలేని పనంటాడు గోపాలం! ఆ మాటకొస్తే గోపాలానికేం! వాడెన్ని కబుర్లయినా చెప్పగలడు! కడుపు నిండుగా ఉండాలేగాని, వంకాయలో ఏ విటమిన్లున్నాయనే దగ్గర ప్రారంభించి అమెరికాలో ఎన్నికల ప్రజాస్వామ్యం ఆచరణలో ఉందనేదాకా గంటల తరబడి అనర్గళంగా ఉపన్యసించగలడు! అందుకనే గోపాలానికి మిత్రులు అంటగట్టిన హాస్క్రాయుడనే బిరుదు నేటికీ సార్థక నామధేయంగానే నిలచిపోయింది! పాపం ఆముసలాయన ఎలా భరిస్తున్నాడో వీణ్ణి! ఆయన స్థితిమాస్తే జాలేస్తుంది! ఒకప్పుడు బాగా బ్రతికినవాడు! కాలక్రమాన జవసత్వాలతోపాటు ఆదాయంకూడా క్షీణించి ప్రస్తుతరం కొడుకుమీదే ఆధారపడవలసిన స్థితిలో ఉన్నవాడు! ఆయనగారికి ఏకైకాధారం గోపాలం! కాని, గోపాలానికిమాత్రం కుటుంబవిషయాలేం పట్టవు! కుటుంబబాధ్యతలంటే గోపాలం దృష్టిలో ముప్పావలా సుష్టుగా భోంచేయటం వరకేనాయె! అందుకే నాకు సామాన్యంగా గోపాలం అంటే కోపం! సాధ్యమయినంతవరకూ దూరంగానే ఉంటాను! కాని గోపాలం అలాంటివాటిని లెక్కచేసే రకంగాదు; అతని కసలు మొహమాటమనేదే లేదాయె! ప్రతిరోజూ మేమంతా హోటలుకు పోయేసమయానికి గుమ్మందగ్గర గోపాలం తయారు! అందులోనూ గోపాలానికి ఆకలి అసలే మరీ లావుకూడాను! వాణ్ణి మేపలేక మా దుంప తెగుతూ ఉంటుంది.

ఎప్పుడన్నా గోపాలం అక్కడ కనుపించకపోతే మేం అదృష్టవంతులమన్నమాటే! అలాంటి సమయాల్లో గోపాలం సామాన్యంగా హోటళ్లోనే ఇంకెవరన్నా స్నేహితుల్తో హాస్క్ కొడుతూ ప్రత్యక్షమవుతాడు! గోపాలానికి

స్నేహితులకేం కొదవలేదు ! అందులోను పెద్ద ఉద్యోగస్తులతోనూ, గొప్పవాళ్ళతోనూ ఏదో ఒకవిధంగా పరిచయం సంపాదించుకోవటం గోపాలానికి హాబీ లాంటిది ! ఈ విద్యలోకూడా గోపాలం అఖండుడు కాదని ఎవరూ అనలేరు ! అంత నేర్పు ఉండడానికి ! యిన్ని ఉన్నా కుటుంబాన్ని గురించిన చింత అతనికి లేకపోవడమే మాకందరికీ బాధాకరంగా ఉండేది ! అందుకు కారణం గోపాలంమీద సానుభూతి కాదని మాకందరికీ తెలుసు ! నిజానికి గోపాలం అంటే మాకెవరికీ ఏమాత్రం సానుభూతి లేని మాట వాస్తవమే ! కాని గోపాలం తండ్రిపట్ల మాకు గల గౌరవాభిమానాలే గోపాలంపట్ల శ్రద్ధ తీసుకునేట్టు చేశాయి. చెట్టంత కొడుకు వీడు వుండికూడా పాపం ఆయన ఈ వృద్ధాప్యంలో సైతం శారీరకంగానూ, మానసికంగానూ కూడా బాధపడుతూవుంటే, కనిపించినప్పుడల్లా మాతో తనగోడు చెప్పుకొని నీరవుతూంటే చిరకాలంగా సంబంధాలున్న మేమెలా ఊరుకోగలం ! అందుకనే గోపాలాన్ని అనేకసార్లు హెచ్చరించాం ! ఏదన్నా ఉద్యోగంలో చేరమని ! కాని గోపాలం పట్టించుకొన్నట్టు లేదు. అందుకు మేం ఆశ్చర్యపడనూ లేదు. ఆశ్చర్యపడాల్సిన అవసరమూ లేదు ! చదువుకునే రోజుల్నుంచీకూడా గోపాలాన్నెరిగిన మాకందరికీ గోపాలం ఎలాంటివాడో బాగా తెలుసు ! అందుకనే చివరికి మేమే నలుగురం కలసి ప్రయత్నంచేసి ఎలాగైతేనేం గుమాస్తా ఉద్యోగం సంపాదించి ఆ సంగతి గోపాలంతో చెప్పినప్పుడు 'ఆఁ నేనా ! గుమాస్తాగానా !' అని నివ్వెరయిపో ప్రశ్నించి, తన కదవుసరంలేదని నిరాకరించినప్పుడుగాని, తర్వాత తండ్రి బలవంతంమీద ఆఉద్యోగంలో చేరినప్పుడు గాని మే మెవరం ఆశ్చర్యపడలేదు.

గోపాలాన్ని ఉద్యోగంలో చేర్పించి రెండు మాసాలవుతూంది. ఉద్యోగంలో చేరిన తర్వాత తరచు కనుపించడమే మానేశాడు ! మాకూడా హోటళ్ళకి పోయేటప్పుడు ఏ మూలనుంచో 'హలో' అంటూ ప్రత్యక్షమవుతాడోనని భయపడాల్సిన అవసరం లేకపోయింది ! నా మట్టుకు నాకు గోపాలం కనుపించి నెల రోజులవుతూంది. ఎందువల్ల కనుపించటం లేదో! బహుశా, పెందరాళే యింటికిపోయి సుష్టుగా భోంచేసి, ముసుగు తన్నితూ ఉండి ఉంటాడు ! అందులోనూ ఆకలి అసలే లావుకూడాను. ఈసారి కనిపిస్తే అడగాలి ! పెందరాళే యింటికి పోవద్దంటాడా యీ సారి ? చూద్దాం. అనుభవిస్తున్నాడుగదా మరి, స్వయంగా !

ఉలిక్కిపడ్డాను !

హారన్ మ్రోగించుకుంటూ ప్రక్కనుంచే దూసుకుపోయిందో కారు ! నా పరధ్యానానికి నన్నే తిట్టుకొంటూ ప్రక్కకి తప్పుకుని తలెత్తిచూచాను ! సెంటర్ దాకా వచ్చేశానప్పుడే! ఇప్పుడెటు పోవటం ? అటు యింటికా ? ఇటు పార్కుకా ? అయినా యివ్వాళ ఒకటో తారీఖాయె ! అప్పుడే యింటికి పోవడమేమిటి? అయినా యిప్పుడేపోయిమాత్రం చేసేదేమిటి ? యింక పార్కులో మాత్రం ఏముంది ! యిక్కడున్న చలిచాలక ఇంకా అక్కడికిపోవడం అర్థంలేనిపని ! పోనీ ! సినిమా కెడితే! చూసి చాలారోజులయింది

చూడాను. యిప్పుడు అశ్రద్ధ చేస్తే తర్వాత ఆ జేబులో డబ్బు ఉండదు. మాసే అవకాశమూ ఉండదు. అరే! అప్పుడే ఆరుంబావయిందే! ఫర్వాలేదు. ఇంకా పదిహేను నిమిషాలుంది! ఈలోగా కాస్త కాఫీ త్రాగి రావచ్చు!

అప్రయత్నంగానే కాళ్లు హోటలు వైపు దారితీశాయి!

చిరపరచితమైన గుమ్మంలో అడుగు పెట్టబోతున్నాను! పరధ్యానంగా వున్నానేమో, భుజంమీద బలమయిన చేయి పడటంతో ఉలిక్కిపడ్డాను! అయినా క్షణంలో తమాయించుకొని యింత చనువుగా భుజంమీద చేయివేసిందెవరా? అని వెనుదిరిగి చూశాను!

“బహుకాల దర్శనాలు!” అంటూ చిరునవ్వులో ప్రత్యక్షమయ్యాడు గోపాలం!

చాలారోజుల తర్వాత కలుసుకొన్నందుకు ఆనందిస్తూ చిరునవ్వుతోనే సమాధానమిచ్చి లోపలికి దారితీశాను! గోపాలం అనుసరించాడు!

“ఈ మధ్య తరుచు దర్శనాలే కరువవుతున్నాయే!” అంటూ టేబుల్ ముందు చేరటం ఆలస్యంగా తన సహజ ధోరణిలో ప్రారంభించాడు గోపాలం! “గత నాలుగు రోజుల్లోనూ కనీసం అరడజను సార్లయినా నీకోసం వచ్చివుంటాను!” అని ఎందుకో ఊహించుకోమన్నట్లుగా ఆగాడు గోపాలం!

“అలాగా” అని ఊరుకున్నాను నేను.

“నా నిర్లిప్తతను చూసి తిరిగి అడిగాడు గోపాలం!

“ఎన్నడూ లేనిది నీవిన్ని రోజులు ఎక్కడికి పోయినట్టు?”

“ఎబ్బే ఏమీలేదు! అనుకోకుండా ఊరికి పోవాల్సొచ్చింది! అంతే! విశేషమేమీ లేదు!”

“అలాగా!” అన్నాడు గోపాలం నిర్లక్ష్యంగా.

“అదలా ఉండనీ! ఎన్నడూ లేనిది నీవు నాకోసం ఎందుకు తిరగవలసి వచ్చిందని?” అనడిగాను నేను!

“అదే చెపుతున్నాను! యివ్వాళ నీవు ఆఫీసుకు వెళ్లావా?”

“యివ్వాళ ఏమిటి? రోజూ వెడుతూనే ఉన్నాను!”

“అయితే మీ ఆఫీసులో ఒక ఉద్యోగం ఖాళీగా ఉన్న సంగతి నీకు తెలిసేఉంటుంది!”

“తెలిస్తే?”

“ఆ విషయంలో నీవు నాకు సాయం చేయాలి!”

“ఏ విషయంలో?”

“అదే! ఆ ఉద్యోగం విషయంలోనే!”

“అంటే?”

“నేనా ఉద్యోగానికి అప్లికేషను పెడుతున్నాను! ఈ సందర్భంలో నీ మాట సాయం నాకెంతో తోడ్పడుతుంది!”

“నా సాయం సంగతలా ఉంచు! ఇంతకీ నీకీ వుద్యోగం ఎందుకు?”

“ఎందుకేమిటి? ఉద్యోగాలు చేసేదెందుకో నీకు నేనే చెప్పాలా? ఉద్యోగం చేస్తున్న నీకు తెలియదా?”

“తెలుసునయ్యా మహానుభావా! నాకా సంగతి బాగానే తెలుసు! కాని నీవిప్పుడు చేస్తున్న నిక్షేపంలాంటి ఉద్యోగం వుండగా నీకీ ప్రయత్నా

ఎందుకు? అసలే నే పడుకుంటూంట!" అన్నాను చిరాకుగా.

"నాతో పరిహాసాలాడుతున్నావా?" అన్నాడు గోపాలం సందేహంగా.

"పరిహాసాలాడేందుకు తగినంత తీరిక గాని, ఓపిక గాని నాకు లేదు."

"అయితే నా విషయం నీకు తెలియదనే అనుకోవాలన్నమాట?"

"ఏ విషయం?" అడిగాను నేను విసుగ్గా!

"అదే! నేను ఉద్యోగం మానుకున్న విషయం!" అన్నాడు గోపాలం నిశ్చలతతో!

నిర్ఘాంతపోయాను నేను!

"ఏమిటీ? ఉద్యోగం మానేశావా?" అడిగాను నమ్మలేకపోతూ!

"అవును మానేశాను! అంతకన్నా గత్యంతరం కనిపించలేదు! అసలు మొదట్నుంచీ కూడా నాకా ఉద్యోగమంటే యిష్టంలేదు! ఆ సంగతి నీకెప్పుడో చెప్పాను కూడాను! దానికితోడు మా డిప్యూటీ ఏదో ఒక తప్పు పట్టూనే ఉంటాడు! ఎకౌంటులో కొంచెం తేడా కనిపించిందని మొన్నటికి మొన్న ఏమేమో వాగాడు!" ఆ సమయంలో తెలిసిన వారెవరన్నా అటువచ్చినట్లయితే ఎంత అవమానం!

"అందుకని మానేశావన్నమాట!"

"మరేం చేయను! పగలస్తమానం కష్టపడి చేస్తే వాడిచ్చేదెంత! వెధవది, ఆ ముష్టి డెబ్భయి రూపాయలకోసం ఏ బీ సీ డీ లన్నా రాని ఆ కుంక చెప్పు చేతల్లో ఉండటం నావల్లగాదు! పైగా గుమాస్తా ఉద్యోగమంటేనలుగుర్లోనూ తల వంపులుకూడాను!" అన్నాడు గోపాలం ఆవేశంతో.

"వాడు కుంకయితే కావచ్చు! కాని గుమాస్తా ఉద్యోగం అవమానకరమని నీవనుకోవడం సరిగాదు. ఆ మాటకొస్తే, నేను మాత్రం గుమాస్తా ఉద్యోగం కాదా చేస్తున్నది!"

"కాదని నేనన్నానా? కాని, నీది గవర్నమెంటు ఉద్యోగమాయె. అందుకేగా, నేను మీ ఆఫీసులో చేరాలనుకుంటున్నది!" అన్నాడు గోపాలం.

నాకింక గోపాలానికి చెప్పబూనడటం దండుగనిపించింది. ఏవేవో ఊహించుకొని, అంతకుముందే ఒక నిశ్చయానికి వచ్చినవాడికి ఎవరుమాత్రం ఏం చెప్పగలరు? అనుకొనే మౌనంగా ఊరుకున్నాను.

నా మౌనాన్ని చూసి, తిరిగి గోపాలం అడిగాడు. "అయితే, నేను మానుకోవడం నీకిష్టం లేదన్నమాట!"

"అవును. అక్షరాలా! నీవు చేసిన దానికన్నా తెలివితక్కువ పని మరొకటుండబోదు. ఈ రోజుల్లో ఉద్యోగాలంటే, హోటల్లో కాఫీలాగా తేలిగ్గా దొరికేవని నీ ఉద్దేశంలా ఉంది! ఉద్యోగం మానుకోవడం ద్వారా నీవేదో స్వతంత్రుడవయి పోయినట్లు భావిస్తున్నావులా ఉంది. కాని గోపాలం యీ విషయంలో నీవు కేవలం లోతు తెలియని ఈతగాడివి?"

"సరే! జరిగిందేదో జరిగిపోయింది! యిప్పుడే నీవు నన్ను తిట్టి ప్రయోజనం లేదు! యింతకీ మరి మీ ఆఫీసులో ఉద్యోగం విషయం ఏమంటావు?" అంటూ ప్రసంగాన్ని మళ్ళించాడు గోపాలం!

"ఏం కావాలి సార్!" అంటూ యింతలో సర్వరు వచ్చాడు! గోపాలం వంక చూశాను! గోడకున్న కాలెండరు బొమ్మను తదేకంగా చూస్తున్నాడు. చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమచిత్రాన్ని నిర్ణయించబోతున్న జడ్జీలా!

"రెండు కాఫీ" అని చెప్పి పంపాకగాని గోపాలం ఆ చిత్రాన్ని పరిశీలించడం మానలేదు. సర్వరు అటు పోగానే తిరిగి తన మామూలు ధోరణిలో అడిగాడు!
"మరి మీ ఆఫీసులో ఉద్యోగం మాటేమిటి?"

"ఈ ఉద్యోగం సంగతి నీకెవరు చెప్పారు?"

"ఎవరో చెప్పేదేమిటి? నీ కొలీగ్ జగన్నాథమే చెప్పాడు."

"ఓహో! అతడా! నీకు కొత్తగా పరిచయమయ్యాడు కదూ! ఆయనగారికి నీ సంగతి సరిగా తెలియక నీ కబుర్లు విని, నువ్వేదో పెద్ద చదువులు చదివి ఉంటావనుకున్నాడేమో! పాపం నిన్ననవసరంగా ఆశలోకి దింపాడు!"

"అదేం:"

"అవును గోపాలం నీకిన్ని సంగతులు తెలుసుగదా! మరి మాది గవర్నమెంటు ఆఫీసు అనీ, అందులో నీకు ఉద్యోగం దొరకాలంటే నీవు కనీసం మెట్రిక్యులేషన్నా ప్యాసయి ఉండాలనీ నీకు తెలీదా?" అనడిగాను నేను.

తెల్లబోయాడు గోపాలం!

"అయితే నా కాశలేదన్నమాటేనా?" అన్నాడెలాగో చివరికి.

"అంతే! అంతకన్నా చేయదగ్గదిలేదు" అంటూనే సర్వరు తెచ్చిన కాఫీ త్రాగి, బిల్లు తీసుకుని లేచాను. గోపాలం కూడా పూర్తిచేసి లేచాడు!

హోటల్లోంచి బయటికొచ్చి గుమ్మం దగ్గర షాపులో రెండు కిళ్ళీలకు ఆర్డరిచ్చి చుట్టుప్రక్కలు పరిశీలించసాగాను. చీకట్లు పూర్తిగా కమ్ముకున్నాయి. రోడ్డంతా జనం వచ్చిపోయే కార్లతో, రిక్షాలతో సందడిగా ఉంది. యిద్దరు ముగ్గురు బిచ్చగాళ్లు డబ్బాలతో మీదపడితే వాళ్ళనెలాగో వదిలించుకొంటే, యింతలో "పాలిష్ సార్!" అంటూ యింకో కుర్రాడు తయారు! "ఒక్కణా చాలు సార్ అద్దంలా పాలిష్ చేస్తాను!" అంటూ ఆశగా ముందుకు వచ్చాడు కుర్రవాడు! చిరిగినవయినా శుభ్రంగా ఉతికిన బట్టలతో చాలా చలాకీగా ఉన్నాడు కుర్రాడు! నా బూట్లవంక చూసుకొన్నాను! ఉదయమే పాలిష్ చేసిన బూట్లు శుభ్రంగా మెరుస్తున్నాయి! అందువల్ల అవసరం లేదన్నాను! నిరాశతో వెనుదిరిగాడు కుర్రాడు! గోపాలం పాదాలవంక చూశాడు! వాడి కళ్లు ఆశతో మెరిశాయి! గోపాలం చెప్పులు దుమ్ముకొట్టుకుని, ఒకమూల తోలూడి జీర్ణస్థితిలో ఉన్నాయి! కుర్రాడు గోపాలం కాళ్ళదగ్గర సంచీ దింపుకొని "ఒక్కణా చాలు సార్ శుభ్రంగా పాలిష్ చేస్తాను!" అంటూ చెప్పులు ఊడదీయబోయాడు! "ఛీ! కాలిమీద చేయివేస్తావు! అవతలకి ఫో!" అంటూ విదిలించుకొన్నాడు గోపాలం ఆగ్రహంతో! ఆ విదిలింపుకు బోర్లపడ్డాడు కుర్రవాడు! అయినా అది గమనించకుండా "ఛీ!... ఎక్కడ చూసినా

వీళ్ళు! పోలిష్! పోలిష్ అంటూ ఒకటే గోల! అయినా మనకన్నా వీళ్లే నయం! ఎంత లేదన్నా రోజుకు రెండు మూడు రూపాయలు కళ్ళజూస్తారు!" అన్నాడు గోపాలం నావంక తిరిగి! ఏమంటూ కన్నీళ్లు!

నాకు కండుకు వచ్చింది గోపాలం ప్రవర్తనకి! "వాడిమీదా, వీడిమీదా కాఫీకోసం పడే నీకన్నా, వీడే నయం కదా!" అనబోయి తమాయించుకొని నిదానంగా అన్నాను! "అయితే గోపాలం నీ లెక్కప్రకారం ఈ పని మీద రోజుకి రెండు మూడు రూపాయలొస్తాయి! ఈ పనిలోఅయితే ఒకడి క్రింద పడి ఉండనక్కరలేదు! కాలేజీ డిగ్రీల సమస్య అసలేలేదు! కావాలంటే అవసరమయిన సామాన్లు యిప్పుడే కొని యిస్తాను! మరి నీవు స్వాతంత్రంగా ఒకరిని పీడించనక్కరలేకుండా బ్రతకటానికి ఎందుకు ప్రయత్నించరాదు?" అన్నాను నేను కోపంతో!

నిర్ఘాంతపోయాడు గోపాలం! కొద్ది క్షణాలవరకూ అలాగే నిశ్చేష్టుడై నావంక చూస్తూ నిల్చుండిపోయాడు! అంతలోనే తేరుకొని నావంక [illegible] చూస్తూ అప్పుడే హోటలు గుమ్మం ఎక్కుతున్న ఎవరినో పిలుస్తూ అటే పోయాడు. "ఏమండోయ్! బహుకాల దర్శనాలు" అంటూ మళ్ళీ పాత వృత్తిలో పడ్డాడు గోపాలం!...



వేర అక్కొపొవ

ఈమె మాస్కోవెరైటీ థియేటర్‌కు చెందిన కళాకారిణి. ఈమె మాస్కోలో నివసించుచున్న శ్రీ గిడుతూరి సూర్యం వద్ద, ఆంధ్ర జానపద నృత్యరీతులను నేర్చుకొని ప్రదర్శించింది.

## ఆశీస్సులు

జన్మదినోత్సవ కానుకగా అభ్యుదయకు రు 25-0-0 విరాళమిచ్చిన చిరంజీవి తాపీ సుజాతకు అయురారోగ్య విద్యాభివృద్ధిని కాంక్షిస్తున్నాం. సుజాత శ్రీ తాపీ ధర్మారావుగారి మనుమరాలు. తాపీ మోహనరావు, రాజమ్మగారల కుమార్తె.